

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: సాతులూరు గ్రామదేవతల ఆలయ పదో వార్షికోత్సవం ఈ నెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



2న కోటి నామోత్సవం

మాచర్ల: పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఫిబ్రవరి 2న శ్రీ భగవాన్ గీతా యజ్ఞం - కోటి నామోత్సవాన్ని జయప్రదం చేయాలని సత్సంగ సభ్యులు బుధవారం ప్రచారం చేశారు.



వైభవంగా కల్యాణ మహోత్సవం

తెనాలి రూరల్: స్థానిక సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవారి శ్రవణా నక్షత్రం సందర్భంగా నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పాడుకో.. దోచుకో !

- రేషన్ బియ్యం దందాకు వేలం పాటలు
- పచ్చనేతకు నెలకు రూ. 25 లక్షలు
- రెండు నెలల అడ్వాన్స్ రూ. 50 లక్షలు చెల్లింపు
- ఒప్పందం కుదుర్చుకున్న ఒంగోలు మాల్యాద్రి బ్యాచ్
- బాపట్లకు దందాను విస్తరించే ప్రయత్నం
- నెలకు రూ.25 నుంచి రూ. 30 లక్షలు ఇస్తామంటూ పోటీ పడుతున్న ముఠా
- గతంలో దందా నిర్వహించిన ఒంగోలు ప్రసాద్ వేలంలో వెనక్కు తగ్గిన వైనం

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో రేషన్ బియ్యం దందా పడగ విప్పింది. ఇప్పటివరకూ ప్రకాశం జిల్లాలో పేదల చౌక బియ్యాన్ని సేకరించి కృష్ణపట్నం పోర్టు ద్వారా తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్న పచ్చ ముఠా మాల్యాద్రి బ్యాచ్ ఇప్పుడు దందాను బాపట్ల జిల్లాకు వేగంగా విస్తరిస్తోంది. నియోజకవర్గాలకు చెందిన పచ్చ నేతలకు డబ్బులు ఎరవేసి, బియ్యాన్ని అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. రేషన్ దందా నిర్వాహకులు రూ. లక్షల్లో మామూళ్లు ముట్టజెప్పేందుకు పోటీ పడుతున్నారు. ఇదే అవకాశంగా పచ్చనేతలు వేలం పాటలు పెడుతున్నారు. అధిక మొత్తం చెల్లించేవారికి చౌక బియ్యాన్ని దోచి పెడుతున్నారు. పచ్చముఠా కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల ద్వారా తరలించి అక్రమార్జనకు పాల్పడుతోంది.

పోటీ పడి వేలం పాటలు

మాల్యాద్రి ముఠాతో వేలం పాటలో పోటీ పడలేక పాత దందా నిర్వాహకుడు ఒంగోలు ప్రసాద్ వెనక్కు తగ్గారు. ఆదిలో ఒంగోలు ప్రసాద్ చీరాల రేషన్ దందాను నిర్వహించారు. కూటమి సర్కార్ కొలువుదీరాక మొదటి రేషన్ దందా చీరాలతో మొదలు పెట్టిన ప్రసాద్ అక్కడి పచ్చనేతకు తొలుత నెలకు రూ. 14 లక్షలు చెల్లించేలా బేరం కుదుర్చుకున్నారు. రెండు నెలలు గడవకముందే పచ్చనేత ధర పెంచి రూ. 20 లక్షలతో తిరిగి ఒప్పందం చేసుకున్నారు. నాలుగు నెలలు పూర్తి కాక ముందే అధికంగా ఇస్తామని ఒంగోలుకు చెందిన మాల్యాద్రి బ్యాచ్ ఆఫర్ ఇవ్వడంతో పచ్చనేత వేలంపాట పెట్టారు. దీంతో చీరాల బియ్యం దందా ఇప్పుడు ఒంగోలుకు చెందిన మాల్యాద్రి బ్యాచ్ వశమైంది. పచ్చనేతల ప్రోత్సాహంతో ఇప్పటికే ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, సంతనూతలపాడు, కనిగిరితోపాటు పలు నియోజకవర్గాల్లో చౌక బియ్యం దందాను మాల్యాద్రి బ్యాచ్ దిగ్విజయంగా కొనసాగిస్తోంది. ఈ బ్యాచ్‌లోని మాల్యాద్రి, ప్రసాద్‌లు స్థానికంగా బియ్యం సేకరణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. మధు సేకరించిన బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు అడ్డంకులు లేకుండా తరలించే బాధ్యతలు చూస్తారు.

పాత బకాయి కోసం పంచాయితీ

కొత్త దందా నిర్వాహకులు తెరపైకి రావడంతో ఒంగోలు ప్రసాద్ ఇవ్వాల్సిన రూ. 6 లక్షల బకాయిలను ఇప్పించాలని చీరాల ప్రాంతానికి చెందిన పలువురు రేషన్ పచ్చనేతను కలిసి మొరపెట్టుకున్నట్లు సమాచారం. ఒంగోలు ప్రసాద్‌ను పిలిపించి డబ్బులు ఇప్పించే ప్రయత్నం చేస్తానని, అతను ఇవ్వకపోతే కొత్త దందా నిర్వాహకుల వద్ద నుంచి ఇప్పించే ప్రయత్నం చేస్తానని పచ్చనేత హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే, పాత దందా బకాయిలు చెల్లించేందుకు ఒంగోలు మాల్యాద్రి బ్యాచ్ అంగీకరించలేదని తెలుస్తోంది. పచ్చనేతకే కాకుండా దందా నిర్వాహకులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు సివిల్ పోలీసులకు సైతం పెద్ద మొత్తంలో నెల మామూళ్లు చెల్లిస్తున్నట్లు సమాచారం.



దోపిడీకి అడ్వాన్స్



తాజాగా చీరాల నియోజకవర్గంలో రేషన్ దందా వేలం పాటలు ముగిశాయి. ఒంగోలుకు చెందిన మాల్యాద్రి, మధు, ప్రసాద్‌ల బ్యాచ్‌తోపాటు పాత దందా నిర్వాహకుడు ఒంగోలు ప్రసాద్‌లు పోటీ పడ్డారు. పచ్చ నేతకు నెలకు రూ. 25 లక్షలు చెల్లించేందుకు మాల్యాద్రి బ్యాచ్ సిద్ధమైంది. పైగా అడ్వాన్స్ కింద రూ. 50 లక్షలను రెండు రోజుల గడువులోనే చెల్లించింది. దీంతోపాటు చీరాల నియోజకవర్గంలో అన్ని రకాల దందాలను పర్యవేక్షిస్తున్న పచ్చనేత తనయుడి బ్యాచ్ అరుణ్, ఆనంద్, అమర, రాజేష్‌లకు నెలకు రూ. 50 వేల చొప్పున రూ. 2 లక్షలు సైతం చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. దందాకు సహకరించని డీలర్లను తొలగించి, వారి స్థానంలో కొత్త వారితో నియమించుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

చేనేతలకు ఆర్థిక భరోసా కల్పనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి సూచన

బాపట్ల టౌన్: చేనేత కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. చేనేతల జీవన పరిస్థితులపై సంబంధిత అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చేనేత వృత్తిలో ఉన్న వారంతా కూలీ చాలక చాలా ఇబ్బందులు పడుతున్నారని, విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. అర్హులైన వారందరికీ ముందుగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని చెప్పారు. జాయింట్ లైబిలిటీ గ్రూపులు ఏర్పాటు చేసి నేత కార్మికులను సభ్యులుగా చేర్చాలని, వారందరికీ రుణ సదుపాయం కల్పించేలా చేనేత జౌళి, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రక్రియ సమర్థంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. చేనేత పార్క్ అభివృద్ధిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. పార్క్ ఏర్పాటుతో చేనేత కార్మికులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. చేనేత ముద్ర పథకం కింద 1,044 మందికి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని వెల్లడించారు. ఇప్పటి వరకు 870 దరఖాస్తులు నేతన్నల నుంచి వచ్చాయని, వాటిని తక్షణమే పరిశీలించి అర్హులందరికీ రుణ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. మిగిలిన వారికి రుణాలు అందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. రుణాల మంజూరుకు చేనేత జౌళి, డీఆర్‌డీఏ, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. చేనేతలకు మేలు చేయడమే లక్ష్యంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు, ఎల్‌డీఎం శివకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల మిళితంపై ప్రత్యేక కసరత్తు చేయాలి

బాపట్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల మిళితంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కసరత్తు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విద్యాశాఖ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించాలని చెప్పారు. బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి మంచి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు కూడా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బోధనపై ఆసక్తి చూపడం లేదని, దీంతో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతుందనే సమాచారం అందిందని తెలిపారు. ఈ అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులను చైతన్య పరచాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల్లో సామాజిక అంతరాలు తొలగించడం, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పాఠశాల ఉండేలా మిళితం చేసే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. విద్యార్థుల్లో డ్రాప్ అవుట్స్ పూర్తిగా అరికట్టడానికి ఈ నూతన విధానం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సమానత్వంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలల మిళితంపై ఇప్పటికే తయారుచేసిన నివేదికను పునఃపరిశీలన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

నిఘా నీడలో చీరాల

- అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట దిశగా 210 సీసీ కెమెరాల ఏర్పాటు
- భారీ స్క్రీన్, కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు
- చోరీలు, రోడ్డు ప్రమాదాలు, ఈవ్‌టీజింగ్‌కు అడ్డుకట్టే లక్ష్యం
- పోలీసుల నిఘాలోకి తీర ప్రాంతం



210 కెమెరాలతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు (ఫైల్)

చీరాల: చిన ముంబాయిగా పేరున్న చీరాల ఇప్పుడు పూర్తిగా పోలీసుల నిఘాలోకి వెళ్లింది. అసాంఘిక శక్తులకు అడ్డుకట్టే లక్ష్యంగా నిఘా వ్యవస్థ పనిచేస్తోంది. తీరప్రాంతం సైతం ఖాకీల కనుసన్నల్లోనే కొనసాగుతుంది.

విస్తరిస్తున్న పట్టణం

చీరాల పట్టణంలో 1.3 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి. వస్త్రాలు కొనుగోలు చేసేందుకు చిరు వ్యాపారులతోపాటు సాధారణ ప్రజలు వస్తుంటారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే బీచ్‌లు మరొక ప్రసిద్ధి. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు చెందిన వారే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వారి రాకతో చీరాల ఎప్పుడు కళకళలాడుతుంటుంది. పట్టణంలోని అన్ని ప్రాంతాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఏపీ పోలీస్ బాస్, డీజీపీ ద్వారకా తిరుమల రావు ప్రారంభించారు.

కమాండ్ కంట్రోల్‌తో నిత్యం పహారా

చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ ద్వారా పోలీసులు 24 గంటలు పర్యవేక్షణ చేస్తున్నారు. భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా 210 సీసీ కెమెరాల్లో రికార్డు అయిన వీడియోలను పరిశీలించేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఐటీ కోర్ టీం నిరంతరం పని చేస్తుంటారు. 24 గంటలు వీరు ఈ విధుల్లోనే ఉండేందుకు ముగ్గురిని నియమించారు.



చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ గదిలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్

పర్యాటకుల రక్షణకు ప్రత్యేక పర్యవేక్షణ

సముద్ర తీర ప్రాంతాలకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పర్యాటకులు అధికంగా చీరాల వస్తుంటారు. కార్తిక మాసం పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించేందుకు వాడరేవు, రామాపురం బీచ్‌లు ప్రసిద్ధి. ప్రతి ఏటా కార్తిక మాసంలో లక్ష మంది వరకు భక్తులు సముద్ర స్నానాలు చేస్తుంటారు. వరుస సెలవులు, వేసవి సెలవుల్లో చీరాల బీచ్‌లు పర్యాటకులతో కళకళలాడుతుంటాయి. బీచ్‌లకు వచ్చే పర్యాటకుల కోసం ప్రత్యేకంగా వాచ్‌టవర్, ఆరు బృందాలుగా గస్తీ, బీచ్‌లలో 30 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

210 సీసీ కెమెరాలతో 24 గంటల నిఘా

చీరాలకు వివిధ ప్రాంతాలను కలిపేలా రోడ్డు మార్గాలు, ప్రయాణ సౌకర్యాలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది చీరాల వస్తుంటారు. దీంతో నిత్యం రద్దీగానే ఉంటుంది. గడిచిన ఎనిమిది నెలల కాలంలో ఏడు హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు జరిగాయి. ప్రస్తుతం చీరాలలో చీమ చిటుక్కుమన్నా కూడా పోలీసులకు ఇట్టే తెలిసిపోతుంది. ప్రధాన రహదారులు, ప్రధాన ప్రాంతాలు, జనసంచారం ఉండే ప్రాంతాలతో పాటుగా శివారు కాలనీలు, నేరాలు, గొడవలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చీరాలకు వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకు ప్రతి ఒక్కరి కదలికలు చిత్రీకరించేందుకు పర్యాటక ప్రాంతాలైన వాడరేవు, రామాపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం తదితర ప్రాంతాల్లో సైతం హై క్వాలిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ప్రతి కదలిక పోలీసుల కనుసన్నల్లోనే..

చీరాలలో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా పోలీసులు పనిచేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుని ప్రశాంతంగా ఉంచేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పని చేస్తున్నాం. చీరాల వన్‌టౌన్, బీచ్‌లు, జనసంచారం ప్రాంతాల్లో ప్రతి కదలిక రికార్డు చేస్తున్నాం. తీరప్రాంతంలో ప్రమాదాల నివారణ, ప్రాణాపాయ ఘటనల్లో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు డ్రోన్ కెమెరాలు, ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశాం. చీరాల ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిని త్వరగా పట్టుకుని చట్ట ప్రకారం శిక్షిస్తాం. నేరాలను తగ్గుముఖం పట్టేందుకు కృషి చేస్తున్నాం.

– మహ్మద్ మొయిన్, చీరాల డీఎస్పీ

శృతి మించిన టీడీపీ నాయకుల అకృత్యాలు

- వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి దుకాణం కూల్చివేత
- అధికారులను నిలదీసిన వరికూటి అశోక్ బాబు
- బాధితుడికి న్యాయం చేయకపోతే నిరసనలు తప్పవని హెచ్చరిక

భట్టిప్రోలు (కొల్లూరు) : అధికారాన్ని అడ్డంపెట్టుకొని కూటమి నాయకుల అకృత్యాలు రోజురోజుకు శృతిమించుతున్నాయి. బాపట్ల జిల్లా పల్లెకోనలో బుధవారం కేసన శ్రీనివాసరావు చికెన్ దుకాణం కూల్చివేత వివాదాస్పదమైంది. మంగళవారం రాత్రి సచివాలయం సెక్రటరీతో నోటీసులు ఇప్పించిన టీడీపీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించారు. బుధవారం దుకాణం కూల్చివేయడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీకి చెందిన స్థలంలో దుకాణం నడుపుకొని జీవనం సాగిస్తున్న వ్యక్తి వైఎస్సార్ సీపీకి ఓటు వేశాడన్న ఒకే ఒక కారణంతో ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు టీడీపీ నాయకులకు మద్దతుగా పన్నాగం పన్నడంపై వరికూటి అధికారులను నిలదీశారు. నోటీసులు ఇచ్చి, కనీస గడువు ఇవ్వకుండా కూల్చివేయడంపై భట్టిప్రోలు ఎంపీడీఓ, ఎంఆర్‌ఓలను బుధవారం నిలదీశారు. కూల్చివేసిన దుకాణాన్ని తిరిగి నిర్మించి, చేసిన తప్పును సరిదిద్దుకోవాలని అధికారులకు వరికూటి సూచించారు. దుకాణం తిరిగి నిర్మించే విషయంలో అశ్రద్ధ వహిస్తే పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.



దుకాణాన్ని కూలుస్తున్న పంచాయతీ యంత్రాంగం

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి
- కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికలు
- రెండు జిల్లాల్లో 3.46 లక్షల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నాయి. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 29న పదవీ కాలం ముగియనుండటంతో ఆయా స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా తూర్పు–పశ్చిమ గోదావరి, కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం–విజయనగరం–విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేఎస్ లక్ష్మణరావు పదవీ కాలం మార్చి 29న ముగియనుండగా, మార్చి 8వ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

ఎన్నికల ప్రక్రియ ఇలా

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్న కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుంది. 11న నామినేషన్ల స్క్రూటినీ అనంతరం, ఉపసంహరణకు 13 వరకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి చేస్తారు. మార్చి 8వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ ముగుస్తుంది. కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి రెండు జిల్లాల పరిధిలో 3.46 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న కేఎస్ లక్ష్మణరావు మరోసారి పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తోపాటు మరి కొందరు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు.

న్యూస్‌రీల్

ఏఎన్‌యూ దూరవిద్య డిగ్రీ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (దూర విద్యా కేంద్రం) గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు కార్యాలయంలో ఫలితాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫలితాల్లో బీఏ, బీకాం (జనరల్), (కంప్యూటర్ అప్లికేషన్స్) ఒకటి, రెండు, మూడో సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. దూరవిద్య కేంద్రం పరీక్షల డెప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ అభ్యర్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఫిబ్రవరి 11లోగా ఒక్కో పేపర్‌కు రూ.770 చెల్లించి ఫిబ్రవరి 14లోగా దూర విద్య కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు అందేలా పంపాలని సూచించారు. ఫలితాలు విడుదల కార్యక్రమంలో దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలు




తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉత్తరాషాఢ నక్షత్రం, అమావాస్యను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు భూ వరాహస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించామని, తెలిపారు. 10 గంటలకు సర్వ గ్రహ దోష నివారణ, ఆయురారోగ్యం కోసం సర్వరక్షాకర (సుదర్శన హోమం) నిర్వహించామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ హోమ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వివరించారు.

యార్డుకు 1,05,694 మిర్చి బస్తాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,05,694 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,01,695 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,693 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1816 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 106 , బ్యాంక్ కెనాల్‌కు 163 , తూర్పు కెనాల్‌కు 243 , పశ్చిమ కెనాల్‌కు 176 , నిజాంపట్నం కాలువకు 51, కొమ్మమూరు కాలువకు 514 క్యూసెక్కులు విడుదల చేశారు.

క్లుప్తంగా

‘టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్’ సవరణకు అవకాశం: డీఈఓ

బాపట్ల టౌన్: జిల్లాలోని ఉపాధ్యాయులకు ‘టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్’ను అప్డేట్ చేసుకునేందుకు అవకాశం ఉందని డీఈవో పరుషోత్తమ్ తెలిపారు. గతంలో ఎవరైనా తప్పులు సబ్మిట్ చేసినట్లయితే వాటిని వెంటనే సవరణ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ 15 రోజుల తర్వాత మృతి చెందడంపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాలు ఇలా ఉన్నాయి. మార్టూరులో నివాసం ఉంటున్న చిగురుపాటి శివశంకర్ తండ్రి శివయ్య (68) ఈనెల 12న స్థానిక మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి జాతీయ రహదారికి పడమర వైపు గల సర్వీసు రోడ్డులో మోపెడ్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో టీవీఎస్ షోరూం సమీపంలో వాహనానికి హఠాత్తుగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడే పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షోకాజ్ నోటీసులు వెనక్కి

ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు డీఈఓ నిర్ణయం

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్) ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం వెనక్కు తీసుకున్నారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో ఏడుగురు ఉపాధ్యాయులు సెలవులో ఉన్న కారణంగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో 50 శాతానికి మించకుండా సెలవు తీసుకోవచ్చునని స్పష్టంగా ఉండటంతో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ రేణుకను బుధవారం డీఈవో కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో హెచ్ఎంతోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కు తీసుకుంటున్నట్లు డీఈఓ సీవీ రేణుక తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు నోటీసులకు ఎటువంటి సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా

- డీఎస్పీ రామాంజనేయులు
- ఫిబ్రవరి ఒకటి నుంచి నిబంధనలు అమలు


హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించడం ఖాయమని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. పట్టణ ప్రజలకు హెల్మెట్ వాడటంపై బుధవారం అవగాహన కల్పిస్తూ ఆయన ఆధ్వర్యంలో పోలీసులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. హెల్మెట్ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకే ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారని వెల్లడించారు. రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు ప్రధానంగా తల భాగంలో గాయాలు అవుతాయని, హెల్మెట్ ధరించడం వల్ల రక్షణ పొందవచ్చని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలతోపాటు చలనాలు కూడా విధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాంబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు ముగిసిన మార్కింగ్ ప్రక్రియ

- ఐదు గ్రామాల్లో 17 కిలోమీటర్ల మేర మార్కింగ్
- భూములు కోల్పోతున్న రైతుల వివరాల నమోదు


కేసానుపల్లి సమీపంలో మార్కింగ్ నిర్వహిస్తున్న సర్వే సిబ్బంది

నరసరావుపేట రూరల్: బైపాస్ రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. మంగళవారం రావిపాడు నుంచి మార్కింగ్ ప్రారంభించి, సాయంత్రానికి జొన్నలగడ్డ వరకు పూర్తి చేశారు. రావిపాడులో ఒక కిలోమీటరు, గుంటగార్లపాడులో కొంత మేర శాటిలైట్ సిగ్నల్ అందక ప్రక్రియ నిలిచిపోయింది. బుధవారం మూడు బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. జొన్నలగడ్డ నుంచి కేసానుపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేర మార్కింగ్ చేశారు. అలాగే మంగళవారం శాటిలైట్ సిగ్నల్ కారణంగా నిలిచిపోయిన రావిపాడులో కొంతభాగం, గుంటగార్లపాడులో కూడా మార్కింగ్‌ను పూర్తి చేశారు. దీంతో కేసానుపల్లి, జొన్నలగడ్డ, నరసరావుపేట, ఇస్సప్పాలెం, గుంటగార్లపాడు, రావిపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని 17 కిలోమీటర్ల మార్కింగ్ పూర్తి చేసినట్టయింది. గతంలో హైవే అథారిటీ చేసిన సర్వేలో రహదారి నిర్మాణానికి 60 మీటర్ల మేర భూమిని సేకరించాలని నిర్ణయించి మార్కింగ్ ఇచ్చారు. తాజాగా చేస్తున్న సర్వేలో 45 మీటర్లకు కుదించి మార్కింగ్ చేస్తున్నట్టు సమాచారం. విలువైన భూములను ఇచ్చేందుకు రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. మార్కింగ్ చేస్తున్న సమయంలో హద్దురాళ్లను హైవే అథారిటీ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. మార్కింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో భూ సేకరణపై రెవెన్యూ శాఖ దృష్టి పెట్టారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయనున్నారు. వారం రోజుల్లో రైతుల సంఖ్య, పూర్తి విస్తీర్ణం వివరాలు తెలుస్తాయని తహసీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- ఫిబ్రవరి ఐదు నుంచి ఒకేషనల్ కోర్సులకు..
- 10 నుంచి సైన్స్ కోర్సులకు..


ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్, 10 నుంచి సైన్స్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) జరగనున్నాయి. ఈమేరకు ఇంటర్మీడియెట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 26,308 మంది సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల వారీగా 2,082 మంది విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 119 కళాశాలల్లో ఏర్పాట్లు చేశారు. మొత్తం 119 కళాశాలల్లో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కాగా, మిగిలిన వాటిలో ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరగనుండగా, హాల్ టిక్కెట్లు మరో మూడు రోజుల్లో రానున్నట్లు ఆర్ఐఓ జీకే జుబేర్ తెలిపారు. కాగా నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులకు గాయాలు


విద్యార్థిని పరామర్శిస్తున్న డీఈవో చంద్రకళ

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలం బుర్రిపాలెం గ్రామంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. మండల కేంద్రానికి సరైన రవాణా సౌకర్యం లేకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రుల అభీష్టం మేరకు ఇటీవల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని విద్యార్థులను నూజెండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు తీసుకొని వచ్చిన బస్సును రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యార్థులను ఢీకొంది. ఈ ప్రమాదంలో 6వ తరగతి విద్యార్థి కత్తి అఖిల్, 7వ తరగతి విద్యార్థి ఏటి అశోక్‌లకు గాయాలు అయ్యాయి. వీరిని 108 ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వినుకొండ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న వారిని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పరామర్శించారు. వైద్యాధికారితో మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవరు సమయస్ఫూర్తితో వ్యవహరించటంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

3న షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పెదవడ్లపూడిలోని సత్యషిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరు నాగభూషణం తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 3న ఉదయం 5 గంటలకు కాగడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సుమారు 70 వేల మందికి అన్నదానం నిర్వహించనున్నామని వివరించారు. ఈ వార్షికోత్సవంలో జబర్దస్త్ కామెడీ షో కళాకారుల ఆధ్వర్యంలో హాస్యవల్లరి, సినిమా సంగీత గాయకులతో సంగీత విభావరి, డూప్ స్టార్ మ్యూజిక్ షో వంటిసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని, భక్తులు సాయినాథుని దర్శించి బాబా కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వెంకటపాలెంలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కేసు నమోదు చేసిన తుళ్లూరు పోలీసులు


వెంకటపాలెంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

వెంకటపాలెం(తాడికొండ): 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు వలపన్ని పట్టుకున్న ఘటన తుళ్ళూరు మండలం వెంకటపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటపాలెం గ్రామ పరిధిలో రేషన్ బియ్యం నిల్వచేసి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డుకు వెళ్ళే అనుసంధాన రహదారిపై ఉంచిన 29 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడులలో బియ్యం బస్తాలు మాత్రమే దొరకడం, అందుకు సంబంధించిన నిందితులెవరూ అక్కడ పట్టుబడకపోవడం విశేషం.

వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


మాట్లాడుతున్న నాసర్‌జీ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యను వ్యాపారీకరణ చేసేందుకు సిద్ధపడుతున్నదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ విమర్శించారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమాఖ్య జిల్లా సమితి సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యారంగంలో అత్యున్నతమైన వైద్యవిద్యను పేద విద్యార్థుల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. దానిలో భాగంగానే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 12 మెడికల్ కళాశాలలను తాము నిర్వహించలేమంటూ జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం కన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఆయా కళాశాలలను 2025–26 విద్యాసంవత్సరంలో పూర్తి చేసి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు వైద్య విద్యార్థులకు శాపంగా మారిన 107, 108 జీఓలకు రద్దు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన నారా లోకేష్.. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఊసే తీసుకురావటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగా రాష్ట్రంలో వందలాది మెడికల్ సీట్లు కోల్పోయే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రైవేటు మెడికల్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నట్లుగా ఉందని ఇప్పటికే విద్యార్థులకు, తల్లిదండ్రులకు అర్థమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత విద్య ఆశలు అడియాసలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే ప్రారంభిస్తే దాదాపు 1,700 సీట్లు రాష్ట్ర విద్యార్థులకు దక్కే అవకాశం ఉంటుందని వివరించారు. కానీ, ప్రభుత్వం తన ఎన్నికల హామీని విస్మరించి అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాలలను మూసివేసే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, గుడిపల్లి జగదీష్ పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- ఆలస్యంగా వెలుగుచూసిన దారుణం
- పోలీసుల అదుపులో నిందితుడు

చిలకలూరిపేట: అభం శుభం ఎరుగని ఆరేళ్ల చిన్నారిపై యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గణతంత్ర దినోత్సవం నాడు ఈ దారుణం చోటుచేసుకుంది. రూరల్ సీఐ బి.సుబ్బా నాయుడు తెలిపిన వివరాల మేరకు... చిలకలూరిపేట మండలంలోని ఓ గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిన క్రమంలో ఇతర బాలలతో కలిసి ఆడుకుంటోంది. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల యువకుడు పాలపర్తి గోవింద్ బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఎంతకూ బాలిక అతని ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో తోటి పిల్లలు ఆ ఇంట్లోకి తొంగి చూడగా బాలికపై లైంగిక దాడికి ప్రయత్నిస్తూ కనిపించాడు. దీంతో ఇరుగుపొరుగు వారికి పిల్లలు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు


సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తదితరులు

నరసరావుపేట రూరల్: లక్షలాదిగా భక్తులు తరలివచ్చే కోటప్పకొండ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 26వ తేదీన కోటప్పకొండలో నిర్వహించనున్న తిరునాళ్ల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో బుధవారం త్రికోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శాఖలవారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాగునీరు, రవాణా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తగినంత సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. నడక మార్గంలో టెంట్లు, గ్రీన్ మ్యాట్లు ఏర్పాటుకు ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని చెప్పారు. యాటీ వద్ద ప్రభలు హైటెన్షన్ వైర్లు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఘాట్‌రోడ్డులో అనువైన బస్సులనే నడపాలని సూచించారు. భక్తులకు ఈ మార్గంలో అనుమతి లేదని, మెట్ల మార్గం ద్వారానే కొండమీదకు చేరుకోవాలని తెలిపారు. చిన్నారులు తప్పిపోకుండా ట్యాగ్‌లు వేయాలని సూచించారు. కొండ దిగువన, ఆలయ ప్రాంగణంలో రెండు కంట్రోల్ రూమ్‌లను శాఖల సమన్వయం కోసం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దేవదాయ శాఖ అదనపు కమిషనర్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. మహాశివరాత్రి రోజున తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఉచిత, శీఘ్ర, వీఐపీ, అభిషేక దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్‌లు ఉంటాయని చెప్పారు. పలు చోట్ల నుంచి 528 బస్సులను నడపనున్నారు. 2.75 లక్షల వాటర్ ప్యాకెట్లు, 140 తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచనున్నారు. 500 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అందిస్తారని డీఈవో చంద్రకళ చెప్పారు. కొండకు చేరుకునే 13 రహదారుల్లో మరమ్మతులు, పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టనున్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఎఫ్‌వో కృష్ణప్రియ, ఆర్డీవో మాధవీలత, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎద్దుల బల ప్రదర్శన

ప్రథమ స్థానం పొందిన గుంటూరు, బాపట్ల జిల్లాల గిత్తలు


4 పళ్ల విభాగంలో పోటీ పడుతున్న గుంటూరు గిత్తలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు జరిగాయి. 4 పండ్ల సైజ్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మానాయుడు గిత్తలు, బాపట్ల జిల్లా మండల కేంద్రమైన జె.పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు గిత్తలు సమానంగా 3,900 అడుగుల దూరం లాగాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులు కలిపి రూ. 70 వేలను కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా శావల్యపురం మండలం మతుకుపల్లి గ్రామానికి చెందిన ముండ్రు జీవప్రసాద్, బాపట్ల జిల్లా మండల కేంద్రమైన సంతమాగులూరుకు చెందిన గిత్తలు 3,711 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ. 25 వేలు దక్కించుకున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య గిత్తలు 3,705.10 అడుగుల దూరం లాగి 4వ బహుమతి రూ.20 వేలను దక్కించుకున్నాయి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఎం. జయకృష్ణ చౌదరి, నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం నరసపల్లె గ్రామానికి చెందిన దోప్పరి లక్ష్మీదేవి గిత్తలు 3,663.5 అడుగుల దూరం లాగి 5 వ బహుమతి రూ.18 వేలను కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోండేపాడు గ్రామానికి చెందిన చాగంటి శ్రీనివాస్ చౌదరి గిత్తలు 3,600 అడుగుల దూరంలాగి 6వ బహుమతి రూ.16 వేలను దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా దువ్వూరు మండలం దాసరపల్లె గ్రామానికి చెందిన నరసింహ గిత్తలు 3,469 అడుగుల దూరం లాగి 7వ బహుమతి రూ. 14 వేలను గెలుచుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా మండల కేంద్రమైన పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన శివ గిత్తలు 3,401.8 అడుగులు లాగి 8వ బహుమతి రూ. 12 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. నవీన్‌కుమార్, పల్నాడు జిల్లా ఈపూరు మండలం అంగలూరు గ్రామానికి చెందిన ఆర్. హరిబాబు గిత్తలు 3,369 అడుగులతో రూ. 9 వేలను కైవసం చేసుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 15 జతలు పాల్గొన్నాయి. మిగిలిన 6 జతలకు కూడ రూ. 3 వేల చొప్పున అందచేసినట్లు కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, బి. రామకృష్ణ, ఓ. ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, గాదె కస్పారెడ్డి, కె. జోసఫ్‌రెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణ, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు.

సముద్రంలో గల్లంతు.. నదిలో మృతదేహం

నాగాయలంక: మండలంలోని సంగమేశ్వర్వం శివారు శంకరాపురం గ్రామం నుంచి ఈ నెల 19వ తేదీన చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రం గల్లంతైన మత్స్యకారుడు కోలా నాంచారయ్య(35) మృతదేహం పది రోజుల తరువాత ఏటిమొగ పంటు ప్లాట్‌ఫారం సమీపంలో లభించిందని ఏఎస్ఐ గణేశ్ బుధవారం తెలిపారు. మండలంలోని పాత ఉపకాలి గ్రామానికి చెందిన నాంచారయ్య శంకరాపురం గ్రామానికి చెందిన ముగ్గురు, గుల్లలమోదకు చెందిన మరో వ్యక్తితో కలసి గుల్లలమోద గ్రామానికి చెందిన చింత పాపారావు బోటుపై ఈ నెల 19 రాత్రి సముద్రంలోకి వెళ్లి చేపల వేటకు వల వేశారు. 20వ తేదీ తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో వలను లాగే సమయంలో నాంచారయ్య ప్రమాదవశాత్తూ జారి సముద్రంలోకి పడిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటిమొగ పంటు రూటు సమీపాన కృష్ణానదిలో నాంచాయరయ్య మృతదేహం లభ్యమైంది. నదీ, సముద్ర జలాలు కలిసే ప్రాంతం కావడంతో మృతదేహం నదిలోకి కొట్టుకొచ్చింది. మృతుడి భార్య కోలా వీర నాగ కుమారి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహం దెబ్బతిన డంతో ఏటిమొగ వద్ద దొరికిన చోటనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

2న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



సత్తెనపల్లి: ఫిబ్రవరి 2న ఉదయం 9 గంటలకు సత్తెనపల్లిలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక ట్రయల్స్ జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం తెలిపారు. ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, 4 పాస్‌పోర్ట్ ఫొటోలు, జిరాక్స్ కాపీలు 4, ఒరిజినల్స్ తీసుకుని రావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 97010 52588 సంప్రదించాలని సూచించారు.

మానవాళి రక్షకుడు క్రీస్తు



పెదకాకాని: మానవాళి రక్షకుడు క్రీస్తు అని బైబిల్ మిషన్ అధ్యక్షులు రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ చెప్పారు. పెదకాకాని మండలంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట జరిగిన బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. దైవజనులు ఫాదర్ ఎం దేవదాస్ అయ్య చూపిన సువార్త మార్గంలో పయనిద్దామని, క్రైస్తవ రాజ్య స్థాపనకు నడుంబిగిద్దామని వివరించారు. వచ్చే ఏడాది బైబిల్ మిషన్ మహోత్సవం జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జరుగుతుందని వెల్లడించారు. మహోత్సవాల నిర్వహణకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బైబిల్ మిషన్ మహోత్సవాల నివేదికను అందజేశారు.ముందుగా పశ్చిమగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక గీతాలను ఆలపించింది. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ ఎం. రవి, రెవరెండ్ డి.ఉజ్జీవం, రెవరెండ్ ఎ.తిమోతి రాజు, పాస్టర్ ఆర్.షాలేము రాజు దైవ సందేశాలు అందించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు మహోత్సవాల ఆఖరి ప్రార్థన చేశారు. మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ ఆశీర్వాదంతో విజయోత్సవ శబ్దంతో మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో బైబిల్ మిషన్ అధికారులు సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమన రావు, ఎం రవి తదితరులు పాల్గొన్నారు.